

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి. రత్నకుమారి అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం కపిలేశ్వరపురం మండలంలోని అంగర, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి రత్నకుమారి ఆధ్వర్యంలో 25 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మందులను అందజేశారు. అనంతరం గర్భిణీలు తీసుకోవలసిన జాగ్రత్తలు, పౌష్టికాహారం, ప్రధానమంత్రి వందన యోజన పథకం, ఆసుపత్రిలో ప్రసవాల ప్రాముఖ్యత ప్రభుత్వం ద్వారా కలిగే ప్రయోజనాలను డాక్టర్ రత్నకుమారి, ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు వివరించారు. కార్యక్రమం స్టాఫ్ నర్స్ జె.బంగారు పాప, హెల్త్ విజిటర్ టి.మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పి కె.రమాదేవి, ల్యాబ్‌టెక్నీషియన్ ఆలీ, ఎఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బరకాల రాయితీకి మంగళం..!

- నిలిచిన సరఫరా
- తడుస్తున్న పంటలు
- రైతులకు తప్పని నష్టాలు

ప్రజాశక్తి-రాజోలు

ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులు ధాన్యాన్ని కప్పే బరకాలను రాయితీపై అందజేయకుండా కాలయాపన చేస్తోంది. దీంతో బరకాలు లేక రైతుల పంటలు కాపాడుకొనేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాల్లో ఆయకట్టు దిగువన ఉన్న సముద్ర తీరంలోనే కాక ఎగువన ఉన్న బ్యారేజ్ సమీపంలోని పంట పొలాలు సైతం ఎటా ముంపు బారిన పడుతున్నాయి. దీనివల్ల ఖరీఫ్ సాగు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. జిల్లాలో 1,69,000 ఎకరాల్లో సార్వా సాగు చేస్తున్నారని అంచనా. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను ప్రకృతి వైపరీత్యాలు, వర్షాలు సంభవించినప్పుడు కాపాడుకునేందుకు గతంలో టిడిపి ప్రభుత్వం రాయితీపై బరకాలు అందజేసింది. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకాన్ని నిలుపుదల చేసింది. దీంతో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. గత ఐదేళ్ల గా వర్షాలు కురిశాయి. పొలాల్లో ఆరబెట్టిన ధాన్యం, మిరప, మొక్కజొన్న, మినుములు, కందులు తడిసిపోకుండా కాపాడుకోవడానికి రైతులు అగచాట్లు పడాల్సి వచ్చింది. తమ వద్దనున్న పాత, చినిగిపోయిన బరకాలను కప్పి రక్షణ కల్పించేందుకు ప్రయత్నించినా ఉపయోగం లేకపోయింది. ధాన్యం తడిసిపోయి తీవ్రంగా నష్టపోయారు. మరికొందరు అద్దెకు బరకాలు దొరకుతా యేమోనని పరుగులు పెట్టినా ప్రయోజనం లేకుండా పోయింది.

రాయితీ లేకపోవడం.. రైతుపై భారం

పంట దిగుబడులు చేతికొచ్చే దశలో వర్షాలు పడితే ఈ బరకాలకు విపరీతమైన డిమాండు ఉంటుంది. దీనిని గుర్తించిన గత టిడిపి ప్రభుత్వం 50 శాతం రాయితీపై రైతులకు పంపిణీ చేసేది. అయితే 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక రాయితీ బరకాలకు మంగళం పాడింది. దీంతో రైతులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం రాయితీ మీద పంపిణీ చేయకపోవడంతో తయారీ దారులు ధరలు పెంచి విక్రయిస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కర్షకులు అధిక ధర వెచ్చించి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. గత టిడిపి ప్రభుత్వం హయాంలో నాణ్యమైన టార్పాలిన్ పట్ట ధర రూ.2,400 ఉండేది రాయితీతో రూ. 800లకే రైతులకు అందించారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం రాయితీ పట్టలు పంపిణీ చేయలేదు. ఆపథకానికి మంగళం పాడేసింది. ప్రస్తుతం మార్కెట్లో బరకాలు నాణ్యత తక్కువగా ఉండేవి రూ.2 వేల నుంచి రూ.2,500 ఉండగా, నాణ్యమైన పట్ట రూ.3 వేలు ధర పలుకుతోంది. నాణ్యమైన పట్ట కొనుగోలు చేయాలంటే రైతుకు భారంగా మారింది. ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేస్తే రైతుపై భారం తగ్గుతుంది.



ధాన్యం తడిచిపోకుండా బరకాలు కప్పిన రైతులు(ఫైల్ ఫోటో)

రైతుకు ఎంతో అవసరం

తుపానులు, ఖరీఫ్, రబీ సీజన్లో పంట ఉత్పత్తులను ఆరుబయట ఉంచినప్పుడు వర్షం, మంచు నుంచి కాపాడుకోవడానికి ప్రతి రైతుకూ బరకాలు అవసరం. అనుకోకుండా వచ్చే వర్షాల సమయంలో పంట ఉత్పత్తులు ఆరబెట్టే ప్రాంతంలోనే బరకాలు సిద్ధంగా ఉంచుకుంటారు. ఇంత కీలకమైన బరకాలను కూటమి ప్రభుత్వం రాయితీపై అందించి ఆదుకోవాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా గత ప్రభుత్వం ఐదేళ్లుగా రైతులకు బరకాలను పంపిణీ చేయకుండా వారిపై అదనపు భారం పడేలా చేసింది.

పంటల నూర్పిడి తరువాత..

పంటల నూర్పిడి తరువాత ధాన్యం ఆరబెట్టుకునే సమయంలో వర్షాలు వస్తే నష్టపోకుండా బరకాలు కాపాడతాయని రైతులు తెలిపారు. గతంలో వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను 50 శాతం రాయితీపై అందించేవారు. చిన్న రైతులకు ఎక్కువగా ఉపయోగపడే బరకాలు మార్కెట్ ధర రూ.2,500 ఉంటే వాటిని రూ.1,250కే ఇచ్చేవారు. ఏటా మండలానికి 300 నుంచి 350 వరకు సరఫరా చేసేవారు. ప్రస్తుతం బరకాల పంపిణీకి స్వస్తి పలకడంతో రైతులు మార్కెట్లో రూ.3,500 వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. అంత డబ్బులు పెట్టి కొనలేని రైతులు సిమెంట్, ఎరువుల సంచులతో తయారు చేసిన బరకాలను కొని సరిపెట్టుకుంటున్నారు. జిల్లాలో వరి, మొక్కజొన్న, కూరగాయ పంటలకు ఎక్కుగా రసాయనాలు పిచికారీ చేయాల్సి ఉంది. దీంతో స్ప్రేయర్ల వినియోగం తప్పనిసరి. సొంతంగా వాటిని కొనుగోలు చేయలేని రైతులు కొంతమంది అద్దెకు తెచ్చుకొని వినియోగిస్తున్నారు. గతంలో 50 శాతం రాయితీపై రైతులకు యంత్ర పరికరాలను అందించేవారు. పిచికారీ యంత్రాల రాయితీ పథకానికి సైతం మంగళం పలకటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం తైవాన్ స్ప్రేయర్ల ధర బహిరంగ మార్కెట్లో సుమారు రూ.25 వేల వరకు ఉంది. అంత పెద్ద మొత్తంలో వెచ్చించలేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన ప్రభుత్వం ఇప్పటికైనా చొరవచూపి తైవాన్ స్ప్రేయర్లు, ఇతర వ్యవసాయ యంత్ర పరికరాలు, బరకాలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.


బరకాలు లేక నష్టపోతున్నాం



గత నాలుగేళ్లుగా ఖరీఫ్ సిజన్‌లో పట్టలు(బరకాలు) లేక నష్టపోతున్నాము. గత ఖరీఫ్ సీజన్ కు రెండు ఎకరాల్లో రూ.90 వేలు ఖర్చుపెట్టి వరి సాగు చేశా. పంట కోతకు వచ్చి దశలో ఎడతెరపి లేకుండా వర్షం పడటంతో 80 శాతం పంటంతా తడిచి పోయింది. ధాన్యం రంగు మారింది. ప్రభుత్వం రాయితీ పై పట్టలు ఇవ్వకపోవడంతో నష్టపోవాల్సి వచ్చింది.

-కడలి నాగేశ్వరరావు(కపిల్), కౌలు రైతు, శివకోడు

రాయితీపై బరకాలు పంపిణీ చేయాలి



బరకాలను ప్రభుత్వం రాయితీ పై అందించకపోవడంతో అధిక ధరలతో కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఖరీఫ్ సీజన్లో కురిసిన వర్షాలకు ధాన్యం తడిసి రైతులు నష్టపోయారు.దీంతో రైతులు అప్పులు చేసి పట్టలు కొనుగోలు చేయాల్సి వస్తుంది. కూటమి ప్రభుత్వమైనా రాయితీపై రైతులకు బరకాలు పంపిణీ చేయాలి

- పీతల రామచంద్రరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి

నీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం

ఓటర్ల జాబితా సిద్ధం చేసిన యంత్రాంగం

ప్రజాశక్తి - ఆలమూరు

వ్యవసాయ సాగులో భాగంగా రైతులకు ప్రయోజనార్థం సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. వారి నుంచి ప్రతినిధులను ఎన్నుకునేందుకు ఓటర్ల జాబితా తయారు చేసింది. ఆలమూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో నాలుగు సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల కు ఈనెల 21 నుంచి 23 లోపు రెవెన్యూ అధికారులు ఎన్నికల షెడ్యూలు ఖరారు చేయనున్నారు. తయారైన వాటర్ల తుది జాబితా ఈనెల 10న రెవెన్యూ సిబ్బంది విడుదల చేయనున్నారు. ఆలమూరు డిసి పరిధిలో మడికి నీటి సంఘం ఉండగా వీటి పరిధిలో మడికి, చెముడులంక, పొట్టిలంక గ్రామాలకు చెందిన రైతు ఓటర్లు ఉన్నారు. చొప్పెల్ల నీటి సంఘం పరిధిలో చొప్పెల్ల, నవాబుపేట, నర్సిపూడి, పెనికేరు గ్రామాలకు చెందిన వారు ఉన్నారు.



ఆలమూరు నీటిపారుదల శాఖ కార్యాలయం

ఆలమూరు నీటి సంఘం పరిధిలో ఆలమూరు, చింతలూరు, తాతపూడి, అంగర గ్రామాల వారు ఉన్నారు. చింతలూరు నీటి సంఘం పరిధిలో చింతలూరు, పినపల్ల, పెదపల్ల, సందిపూడి, వెదురుమూడి గ్రామాల రైతులు ఉన్నారు. ఈ మేరకు రెవెన్యూ సిబ్బంది ఓటు హక్కు కలిగిన రైతులతో కూడిన జాబితాను రూపొందించారు. ఈనెల 10న విడుదల చేయనున్న ఈ జాబితాను ఆయా రైతు ఓటర్లు పరిశీలించి అభ్యంతరాలను సంబంధిత సిబ్బందికి తెలియపరచుకోవాల్సి ఉంటుంది.

త్వరలో కొబ్బరి బోర్డు కార్యాలయం ఏర్పాటు

ప్రజాశక్తి - రాజోలు

త్వరలోనే కొబ్బరి అభివృద్ధి బోర్డు కార్యాలయం ఏర్పాటు చేస్తామనిరాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ అన్నారు. కొబ్బరి అభివద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని కేశనపల్లిలో ఏర్పాటు చేస్తే జిల్లాలో ఉన్న కొబ్బరి రైతులకు మేలు చేకూరుతుందన్నారు. శనివారం మలికిపురం మండలం కేశనపల్లి, తూర్పుపాలెం సిసిఎఫ్ సొసైటీ కార్యాలయం వద్ద నిర్వహించిన మహాజన సభ సమావేశంలో ముఖ్యాతిథిగా పాల్గొన్న ఎంఎల్ఎ వరప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన పారిశ్రామిక పార్కుల విధానం, కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఎంఎస్ఎంఇ పార్క్‌ను తూర్పుపాలెంలో ఏర్పాటు చేస్తే అన్ని విధాలుగా ఉపయోగపడుతుందన్నారు. ఈ పార్కు రావడం ద్వారా కొబ్బరికాయకు మంచి గిట్టుబాటు ధర రావడంతో పాటు యువతకు ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. కొబ్బరి ఉత్పత్తుల తయారీ, మార్కెట్ సౌకర్యం వంటి వాటిని ప్రభుత్వం చూసు కుంటుందని, కొబ్బరి బోర్డు కార్యాలయ ఏర్పాటుకు స్థానిక రైతులు ప్రజలు సహకరించాలని ఎంఎల్ఎ కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి మార్క్ ఫెడ్ డైరక్టర్ జి.పెదకాపు, గెడ్డం మహాలక్ష్మీ ప్రసాద్, సొసైటీ సభ్యులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ దేవవరప్రసాద్

అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా 'అల్లాడి'

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా అల్లాడ స్వామి నాయుడు నియమితులయ్యారు. పట్టణానికి చెందిన అల్లాడి స్వామి నాయుడు మాజీ మంత్రి దివంగత నేత మెట్ల సత్యనారాయణ అనుచరుడిగా గుర్తింపు పొందారు. గతంలో అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షునిగా స్వామినాయుడు పనిచేశారు. తొలి నుండి అమలాపురం నియోజకవర్గం లో టిడిపి కీలక నేతగా వ్యవహరించిన స్వామి నాయుడుకు అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ గా పార్టీ అధిష్టానం ఎంపిక చేయడంపై పార్టీ నాయకులు కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం స్వామినాయుడును పలువురు నాయకులు, కార్యకర్తలు కలిసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.




అల్లాడి స్వామినాయుడు

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - కాట్రేనికోన

చెయ్యేరు శ్రీనివాసా అటానమస్ ఇంజినీరింగ్ కళాశాల్లో మొదటి సంవత్సరపు బీటెక్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను కళాశాల చైర్మన్ రామచంద్ర రాజు, సెక్రటరీ కరస్పాండెంట్ డివి ఎన్ఎస్.వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యున్నత ప్రమాణాలతో కూడిన శ్రీనివాసా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల అనతి కాలములోనే నాక్ ఎ గ్రేడు, అటానమస్ హోదా తో విద్యావ్యవస్థ లో నూతన ఒరవడికి నాంది పలికిందన్నారు. సభాధ్యక్షులు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసు కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆధునిక సాంకేతికత మేళవింపుతో పరిశోధనా దక్పథం పెంపొందించుట ద్వారా దేశాభివృద్ధిలో కీలక భూమిక నిర్వర్తించాలన్నారు. మరో ముఖ్యఅతిథిగా అమలాపురం డిఎస్‌పి. టిఎస్ఆర్‌కె. ప్రసాద్ విచ్చేశారు. ఆయన విద్యార్థుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యతో అభ్యసించాలన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి ఆధునిక సాంకేతిక మార్పుల్ని అన్వయించు కుంటు ఉన్నత శిఖరాన్ని అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమయంలో సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమాలో పాలకవర్గ సభ్యులు సందీప్, కళాశాల విద్యాశాఖాధిపతి డాక్టర్ జయలక్ష్మి, వివిధ విభాగాల అధ్యాపకులు, అధి పతులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అదనపు విద్యుత్ ఛార్జీల భారం తగదు

- ఉచిత గ్యాస్ అర్హులైన పేదలందరికీ వర్తింపజేయాలి
- సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్



భీమనపల్లిలో ప్రజాపోరు కరత్రాలను ఆవిష్కరిస్తున్న కారెం వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ట్రూ అప్ చార్జీల పేరుతో పేదలపై అదనపు విద్యుత్ ఛార్జీలు వేయడం తగదని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అన్నారు. అర్హులైన వేదలందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్ లు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా నవంబర్ 8 నుండి 15 వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా పోరు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా శనివారం భీమనపల్లి కాలనీ గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశామని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేదలపై భారాలు మోపుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ఈనెల 14 న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజలను కోరారు. దేశవ్యాప్తంగాను రాష్ట్రంలోనూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన ఈ ప్రజాపోరును నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజురోజుకీ పెరుగుతున్న ధరలు తగ్గించాలని, మహిళలపె, పిల్లలపై, దళితులపైనా హత్యలు, అత్యాచారాలు నియంత్రించాలన్నారు. విద్యుత్ ఛార్జీల పేరుతో ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం తగదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గ్రామీణ పేద ప్రజలు ఉపాధి హామీ చట్టంపైన ఆధారపడి జీవిస్తున్నారని, ఉపాధి హామీ చట్టంలో కూలీలకు ఏడాదికి 200 రోజులు పనులు కల్పించి రోజుకు రూ.600 రూపాయలు వేతనాన్ని ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు జరుపుతున్నారని బెల్ట్ షాపులను రద్దు చేయాలని ప్రజలు ఇబ్బంది కలిగే చోట్ల మద్యం షాపులను తొలగించాలని డిమాండ్ చేశారు . తక్షణం ఉచిత ఇసుకను ప్రజలందరికీ అందుబాటులో తీసుకురావాలని కోరారు. ఉచిత గ్యాస్ ను అర్హులైన తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదలందరికీ తక్షణమే అందించాలన్నారు. రోడ్లు, మంచినీళ్లు, డ్రయినేజీలు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు అందించాలని తదితర సమస్యల పైన ఈ జిల్లాలో ప్రజలందరినీ కదిలించి నవంబర్ 14న కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు బీర వెంకట్రావు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

'ప్రజాపోరు' ను జయప్రదం చేయాలని పిలుపు

అమలాపురం రూరల్: సిపిఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా నవంబర్ 8 నుంచి 15 వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా పోరు నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు టి.నాగ వరలక్ష్మి పిలుపునిచ్చారు. అందులో భాగంగానే శనివారం అమలాపురం మండలం కుమ్మరి కాలవగట్టు ప్రాంతంలో నాగ వరలక్ష్మి ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగాను, రాష్ట్రంలోనూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన ఈ ప్రజాపోరును నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అన్ని మండలాల్లోనూ నిరసన కార్యక్రమాలు నిర్వహించి నవంబర్ 14న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజురోజుకీ పెరుగుతున్న ధరలు తగ్గించాలని, తదితర సమస్యల పైన జిల్లాలో ప్రజలందరినీ కదిలించి కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.శ్యామల దేవి, ఎ.దుర్గ, ఎ.మంగాదేవి, మణిమాల, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం మండలంలో 'ప్రజాపోరు' కరపత్రాల పంపిణీ



ఫిర్యాదు చేసేందుకు విశ్వరూప్,బోస్ తదితరులు

వైసిపి సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టులకు ఖండన

ప్రజాశక్తి - అమలాపురం

మాజీ సిఎం వైఎస్.జగన్ కుటుంబంపై అధికార టిడిపి సోషల్ మీడియాలో అసభ్యకరంగా అనేక పోస్టులు పెడుతూ మరొక పక్క వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు పెట్టడాన్ని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, రాజ్యసభ ఎంపి పిల్లి సుభాష్ చంద్రబోస్ ఖండించారు. ఈ సందర్భంగా జిల్లా వైసిపి అధ్యక్షుడు పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్‌తో కలిసి శనివారం జిల్లా ఎస్‌పికి వైసిపి నేతలు వినతి పత్రం అందజేశారు. విశ్వరూప్ మాట్లాడుతూ మాట్లాడుతూ వైసిపికి 11 సీట్లు వచ్చాయని, వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి, భారతిలపై సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్న వారిపై చర్యలు తీసు కోవాలన్నారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదన్నారు. గతంలో వైసిపి చేపట్టిన సంక్షేమ పథకాలతో పోటీ పడాలి తప్ప, అక్రమ కేసులు బనాయిం చటం సరికాదని రాజ్యసభ ఎంపి పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్‌సిలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎంఎల్‌ఎలు గొల్లపల్లి సూర్యారావు, చిర్ల జగ్గిరెడ్డి, పొన్నాడ వెంకట సతీష్ కుమార్, వైసిపి నాయకులు పిల్లి సూర్య ప్రకాష్, అమలాపురం మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్ర మణి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా 'టిడిపి సభ్యత్వం'

ప్రజాశక్తి -పి.గన్నవరం

ఆపద సమయంలో కార్యకర్త కుటుంబానికి టిడిపి సభ్యత్వం అండగా నిలిస్తుందని నియోజకవర్గ పరిపాలనా పరిశీలకులు షేక్ సుభాన్ అన్నారు. నియోజకవర్గం కో కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ పర్యవేక్షణలో శనివారం మాజీ ఎంపిపి అంబటి భూలక్ష్మి, కోటేశ్వరరావు టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తోలేటి సత్తిబాబు, నాయకులు సంసాని పెద్దిరాజు, పెచ్చెట్టి వెర్రియ్య, గ్రామ శాఖ పితాని రాంబాబు,, యండ్ర శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



ముంగండలో పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి శ్రేణులు

సమస్యలు పరిష్కరించాలని ఎఎన్ఎంల వినతి

ప్రజాశక్తి - ఆలమూరు

గ్రామ సచివాలయం ఎఎన్‌ఎంలు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు విధుల్లోని పనిభారం తగ్గించాలని ఎంపిడిఒ ఎ.రాజుకు విన్నవించారు. మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పనిచేస్తున్న గ్రామ సచివాలయ ఎఎన్ఎంలు అందరూ ఎంపిడిఒ రాజును కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఎఎన్ఎంలు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలోని విధులతో పాటు ఏకకాలంలో గ్రామ సచివాలయంలో విధులను కూడా నిర్వహించాలని అధికారుల నుంచి ఒత్తిడి ఎదురవుతోందన్నారు. గ్రామ సచివాలయాల్లో పనిచేసే ఎఎన్‌ఎంలు కేవలం వైద్య ఆరోగ్యశాఖ ఆదేశించే పనులకే పరిమితం చేయాలని ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గ్రామ సచివాలయ ఎఎన్ఎంలు నిర్వర్తించే బాధ్యతలను ప్రభుత్వం జిఒ రూపంలో విడుదల చేసిన విషయాన్ని ఎంపిడిఒ రాజుకు వివరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ రాజుకు వారు అందజేశారు.



ఎంపిడిఒ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఎఎన్‌ఎంలు

ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటాం

గ్రామ సచివాలయ ఎఎన్ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను, ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసిన జిఒలను ఉన్నతాధికారుల దష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ఎంపిడిఒ రాజు తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన జిఒ ప్రతులను ఆయన పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాలు వెలువరించే వరకూ గ్రామ సచివాలయాల్లోని హౌసింగ్ సర్వేను ఖాళీ సమయాల్లో చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఎఎన్ఎంలు డి.మంగాదేవి, ఎంఎం.శారద, ఎస్.రాణి ప్రియదర్శిని, ఎస్‌కె.నాగూర్‌బీబీ, ఎస్.సంధ్యారాణి, సిహెచ్.ఉమా మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మహిళా సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎస్ఐ కె.చిరంజీవి అధ్యక్షతన మహిళా సంరక్షణ కార్యక్రమంలో భాగంగా శనివారం 45 మంది విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగం, సోషల్ మీడియాలో ఉమెన్ హెరాస్మెంట్, బాల్యవివాహాలు, ఈవ్‌టీజింగ్, రోడ్ సేఫ్టీ, పోక్సోయాక్ట్, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ 1930కి, ఉమెన్ హెరాస్మెంట్‌కి 112 కి ఫోన్ చేయాలన్నారు. ఎస్ఐ చిరంజీవి, మహిళా సంరక్షణ కార్యదర్శి టీంగా ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సాయిరాం, మహిళా పోలీసులు శ్రీ దుర్గా, ఆర్ ఎన్ఎల్ భవాని, పి.మాధురి అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు ఎల్. పూర్ణిమ, సిహెచ్ ఫణి కుమార్, పి.రాంబాబు, వి.సత్యనారాయణ, కె. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. **అల్లవరం:** గోడి బాలికల గురుకుల పాఠశాల్లో విద్యార్థులకు మహిళా సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని అల్లవరం ఎస్ఐ హరీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమలాపురం సిఐ వీరబాబు పాల్గొన్నారు. విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఈవ్‌టిజింగ్, లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ నేరాల, ఇతర నేరాల గురించి విద్యార్థులు కు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఏర్పడితే సహాయం కోసం వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యమంలో స్థానిక పోలీసు సిబ్బంది, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు , సిబ్బంది పాల్గొన్నారు.



అంబాజీపేట జూనియర్ కళాశాల్లో మాట్లాడుతున్న ఎస్ఐ



గోడి గురుకులంలో అవగాహన కార్యక్రమం

17న యూత్ లీడర్‌షిప్ వర్క్ షాప్

ప్రజాశక్తి - అమలాపురం

స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 17న విద్యార్థులకు యూత్ లీడర్ షిప్ వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జి.నాగరాజు, పివి.కృష్ణ. జి.అంజని శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్ శనివారం సర్ సివి రామన్ స్కూల్లో విడుదల చేశారు. ఈనెల 17న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సివి.రామన్ పాఠశాల్లో జిల్లా పరిధిలోని డిగ్రీ పీజీ ఇంజనీరింగ్ విద్యార్థులతో పాటు యువతి, యువకులు, ఉపాధ్యాయులు పాల్గొనవచ్చన్నారు. పాల్గొనే వారు ముందుగా ఈ ఫోన్ నెంబర్లు ఫోన్‌చేసి 9010437244, 9951229250, 9490007058 పేరు నమోదుచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రవణం వేణు గోపాలరావు, ప్రిన్సిపల్ ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

వెంకటాయపాలెం శిరో ముండనం బాధితులకు ఎక్స్‌గ్రేషియాతో పాటు వారి పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రాలు వెంటనే అందజేయాలని భీమ్‌సైనిక్ స్టేట్ అధ్యక్షుడు మేడిశెట్టి ఇశ్రాయేల్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు . వెంకటాయ పాలెంలో 1996లో జరిగిన దళితుల శిరోమండలం కేసులో దళిత పోరాట ఐక్యవేదిక, వివిధ ప్రజా సంఘాల పోరాటంలో ఎంఎల్‌సి తోట త్రిమూర్తులతో పాటు నిందితులు అందరికీ శిక్ష పడిన విషయం తెలిసినదే. ఎన్నో ప్రభుత్వాలు మారుతున్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావలసిన ఎక్స్‌గ్రేషియా రాకపోవడం వారి పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంపై ఇశ్రాయేల్ మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బాధితులకు ప్రభుత్వం నుండి అందవలసిన ఎక్స్ గ్రేషియా, కుల ధ్రువీకరణ పత్రాలు అందే విధంగా మంత్రి సుభాష్ బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేరాలు ఘోరాలు

గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ
నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి గ్రామ శివారున రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న గడ్డి ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న నలుగురు కూలీలు గాయపడ్డారు. శనివారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించారు. రంగంపేట మండలం రాయవరం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ట్రాక్టర్‌పై గడ్డి లోడ్ వేసుకుని గండేపల్లి నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్నారు. గండేపల్లి గ్రామ శివారున ఆ ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న నలుగురు కూలీలు గాయ పడ్డారు. వారిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎన్‌టి రాజాపురంలో నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. శనివారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

950 కిలోల రేషన్ బియ్యం సీజ్

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని ఉండూరు ప్రకాశరావు పేటలో ఒక ఇంట్లో నిల్వ ఉంచిన 950 కిలోల రేషన్ బియ్యం సీజ్ చేసినట్లు శనివారం మండల సివిల్ సప్లై అధికారి కమలకుమారి చెప్పారు. ముందస్తు సమాచారంతో బియ్యం నిల్వ ఉంచిన ఇంటిపై ఎంఎస్ఓ, విఆర్ఒల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. నిర్వాహకుడు శెట్టి లచ్చబాబుపై 6ఏ కేసు నమోదు చేసి బియ్యాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. కాగా సీజ్ చేసిన బియ్యం విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని చెప్పారు.

ఇద్దరు మద్యం విక్రేతల అరెస్టు

ప్రజాశక్తి - ఆలమూరు

మద్యం విక్రయిస్తూ పట్టు బడిన ఇద్దరిని అరెస్టు చేసి శనివారం స్థానిక ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సిఐ ఐడి. నాగేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆలమూరు, కపిలేశ్వర పురం మండలాల్లోని వివిధ గ్రామాల్లో మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నారన్న సమాచారంపై ఆయా ప్రదేశాల్లో దాడులు నిర్వహించామన్నారు. ఈ క్రమంలో మండలంలోని చెముడులంక హైవే పక్కన 8 మద్యం బాటిళ్లను కలిగి ఉన్న ఎన్.సీతా రామయ్యను అరెస్ట్ చేసి, వాటిని స్వాధీన పరుచుకున్నాం. అలాగే కపిలేశ్వరపురంలో బెల్ట్ షాపును ఏర్పాటు చేసి మద్యాన్ని విక్రయిస్తున్న ఎన్.తమ్మయ్యను అరెస్టు చేసి అతని దగ్గర ఉన్న 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ఎక్సైజ్ ఎస్ఐ పి.రాంబాబు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీజిల్ తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

యానాం నుంచి డీజిల్‌ను ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని శనివారం ముమ్మిడివరం పోలీసులు అదుపులోనికి తీసుకుని డీజిల్ సీజ్ చేశారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు భీమవరానికి చెందిన గాడా సురేష్ ఆటోలో 330 లీటర్ల డీజిల్‌ను యానాం నుంచి తరలిస్తున్నాడు. ముమ్మిడివరం లో శనివారం ఎస్ఐ జ్వాలా సాగర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా పోలీసులు డీజిల్ ఆటోను పట్టుకుని, డ్రైవర్ ను అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేధింపులపై కేసు నమోదు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మల్లేపల్లికి చెందిన ఒక అవివాహిత మహిళను వేధింపులు, బ్యాక్ మెయిల్‌కు పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివనాగు తెలిపిన వివరాల ప్రకారం..ప్రతిపాడు మండలం ధర్మవరం చెందిన డివై.ప్రసాద్ సదరు మహిళను వేధింపులకు గురి చేస్తున్నట్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి సంబంధిత వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ మాట్లాడు తూ.మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మహిళలు, బాల బాలికలను వేధించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎటిఎం కార్డు మార్చి నగదు అపహరణపై

ప్రజాశక్తి - రామచంద్రపురం

మహిళ వద్ద ఉన్న ఎటిఎం కార్డును మార్చి ఒక వ్యక్తి రూ.లక్ష అపహరించాడు. ఈ ఘటనపై శనివారం పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. ద్రాక్షారామ గ్రామానికి చెందిన కారుమూరి మాణిక్యంబ సెప్టెంబర్ 14న ఎటిఎంలో నగదు తీసుకోవడానికి వెళ్లింది. ఆమె ఎటిఎం కార్డు మిషన్లో పెట్టగా నగదు రాకపోవడంతో తికమక పడుతోంది. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమె కార్డును ఎటిఎంలో ఉంచి రూ.10 డ్రా చేశాడు. అనంతరం అతడు ఎటిఎం కార్డు ఆమెకు ఇచ్చి వెళ్లిపోయాడు. అతను వెళ్ళిన కాసేపటికి మూడుసార్లు మరో ఎటిఎం నుండి రూ.30 వేలు నగదు డ్రా చేసుకున్నాడు. అనంతరం వివిధ పెట్రోల్ బంకుల్లో మరికొంత నగదు డ్రా చేశాడు. మొత్తం రూ.1,04,800 డ్రా చేసుకున్నాడు. నగదు డ్రా చేసుకున్నట్లు ఫోన్‌కు మెసేజ్‌లు రావడంతో ఆమె ఎటిఎం కార్డు మారిందనే విషయాన్ని గ్రహించింది. దీంతో ఈ ఘటనపై బాధితురాలు శనివారం ద్రాక్షారామం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని పంచాయతీ కార్యదర్శి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో బొబ్బిల్లంక గ్రామ పంచాయితీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆమె విధులు ముగించుకుని ఇంటికి వెళ్లారు. అనంతరం మెడికల్ షాపునకు వెళ్ళి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొని మృతి చెందారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆగస్టులో ఆమె సీతానగరం మండలానికి బదిలీ అయ్యారు. ఆమె మృతి పట్ల ఎంపిడిఒ భారతి, సిబ్బంది సంతాపం తెలిపారు.

పొలిటికల్ హీట్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలుగుతోందని, అవసరమైతే తాను హోం శాఖను తీసుకుంటానంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా పొలిటికల్ హీట్‌ను పెంచాయి. సాధారణ ప్రజానీకంతో పాటు రాజకీయ నేతల్లోనూ ఈ వాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. టిడిపి, బిజెపి, జనసేన కూటమి ఏర్పడటంలో పవన్ కళ్యాణ్ కీలకంగా వ్యవహరించిన విషయం విధితమే. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత జనసేనానికి తగిన ప్రాధాన్యత ఇవ్వటంలేదనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. పవన్ కళ్యాణ్ సూచనలను టిడిపి అధినేత పరిగణలోకి తీసుకోవటంలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. మరోవైపు క్షేత్రస్థాయిలో టిడిపి, జనసేన నాయకులు మధ్య ఘర్షణలు నిత్యకృత్యంగా మారాయి. రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట ఘర్షణలు పరిపాటిగా మారాయి. ఈ నేపథ్యంలో తాజాగా జనసేనాని చేసిన వ్యాఖ్యలు మరింత ప్రాముఖ్యతను పెంచాయి. కూటమిలో నిప్పు రాజుకుందనే ప్రచారం ఊపందుకుంది. అయితే కేవలం నాలుగు నెలలకే ఈ పరిస్థితి ఉంటే రాబోయే నాలుగేళ్లు ఎలా ఉంటుందనే ఆయా వర్గాల్లో చర్చ ప్రారంభమైంది.

ఎంఎల్‌సి ఎన్నికలకు మోగిన నగారా

ఉపాధ్యాయ ఎన్నికలకు ఎన్నికల నగారా మోగింది. ఈ వారంలో నోటిఫికేషన్ విడుదలైన విషయం విధితమే. జిల్లా వ్యాప్తంగా 16,316 మంది ఓటర్లు ఉన్నారు. మరోవైపు పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. రాజకీయ పార్టీలు ఓటర్లను జల్లెడ పడుతున్నాయి. ఈ నెల 23 వరకూ ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో ఉన్నత విద్య పూర్తి చేసిన వారి వివరాలను ఇప్పటికే రాజకీయ పార్టీలు సేకరించాయి. వ్యక్తిగతంగా కలవటంతో పాటు ప్రధాన కూడళ్లలో ఓటు నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి నమోదు కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలలో ఇప్పటివరకూ పిడిఎఫ్ విజయ ఢంకా మోగించిన విషయం విధితమే. గెలిచిన అనంతరం ఉపాధ్యాయులు, పట్టభద్రుల గళం శాసన మండలిలో విన్పించడంతో పాటు ప్రజా సమస్యలను పరిష్కార దిశగా విశేష కృషి చేశారు. ఈ ఒరవడికి కొనసాగించేందుకు పిడిఎఫ్ అభ్యర్థులు ఈ ఎన్నికలలో పోటీకి సమాయత్తం అవుతున్నారు.

సిపిఎం ప్రజా పోరు

పెరుగుతున్న అధిక ధరలకు వ్యతిరేకంగా, మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగానూ, జమిలి ఎన్నికలను నిరసిస్తూ సిపిఎం చేపట్టిన ప్రజాపోరు ఈ వారంలో ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14వ తేదీ వరకూ జరిగే ఈ కార్యక్రమాల ద్వారా పాలకుల వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు ప్రజల గొంతుకై సమస్యలను వెలుగెత్తేందుకు



సిద్ధమైంది. ఈ నేపథ్యంలో గత రెండ్రోజులుగా జరిగిన కార్యక్రమాలకు ప్రజలనుంచి విశేష మద్దతు లభిస్తోంది. ప్రజలు భాగస్వాములై తమ మద్దతు తెలుపుతున్నారు. మరోవైపు జమిలి ఎన్నికల పేరుతో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేందుకు జరుగుతున్న ప్రయత్నాన్ని ప్రజలకు వివరిస్తూ ప్రజాపోరు ముందుకు సాగుతోంది.

అపార్ వ్యవస్థతో సతమతం

నూతన విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో 'అపార్' నమోదుకు తెర తీసింది. త్వరిత గతిన పూర్తి చేయాలని విద్యావ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తోంది. విద్యార్థుల పేర్లు ఆన్‌లైన్ చేసే క్రమంలో ఆధార్‌లోనూ, బర్త్ సర్టిఫికెట్‌లలోనూ నమోదైన పొరపాటు ప్రస్తుతం తలపోటుగా మారాయి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్, పంచాయతీలలో త్వరిత గతిన సవరణలు పూర్తికాకపోవటంతో తల్లిదండ్రులు కార్యాలయాల వద్ద క్యూ కడుతున్నారు. క్షేత్రస్తాయిలో సమస్యలను పరిగణలోకి తీసుకుని అపార్ నమోదు ప్రక్రియ కాలపరిమితి పొడిగించాలని తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎంఎల్‌ఏ బండారు సత్యానందరావు

ప్రజాశక్తి - రావులపాలెం

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తుందని ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. మండల పరిధి ఈతకోట నెక్కంటి కాలనీలో సర్పంచ్ యర్రంశెట్టి సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగిన రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంఎల్‌ఎ బండారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నెక్కంటి సీఫుడ్స్ సౌజన్యంతో, పంచాయతీ సహకారంతో నెక్కంటి కాలనీ ప్రధాన రహదారికి నూతనంగా నిర్మాణం చేసిన రోడ్డును ఎంఎల్‌ఎ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివద్ధి ఊసే లేకుండా పాలన సాగించి అక్రమాలకు నాంది పలికారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. కాలనీ వాసులు, ముస్లింలు కొన్ని సమస్యలు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకు రాగా త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఎ కూటమి నాయకులు, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు

యానాం వార్తలు

21న యానాంలో ముఖ్యమంత్రి, గవర్నర్ పర్యటన

ప్రజాశక్తి - యానాం

ఈనెల 21వ తేదీన పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్ రంగస్వామి, గవర్నర్ కైలాస్ నాదన్, ఫిషరీస్ మినిస్టర్ లక్ష్మీనారాయణలు యానాం నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. శనివారం మల్లాడి స్వగృహంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. మత్స్యకారులకు ఒఎన్‌జిసి సంస్థ ద్వారా రావలసిన నష్ట పరిహారం తమ ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. సిఎస్‌ఆర్ నిధులు ద్వారా చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలకు పుదుచ్చేరి ప్రభుత్వంతో అభివృద్ధి పనులకు కావలసిన అనుమతులు వచ్చినట్లు తెలిపారు. వాటికి సంబంధించి ఈనెల 14వ తేదీన జరిగే శంకుస్థాపన కార్యక్రమాలలో పాల్గొంటానని మల్లాడి తెలిపారు.

ఘనంగా రాష్ట్ర స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి డైరెక్టరేట్ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ యూత్ అఫైర్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆటల పోటీలు స్థానిక బాలయోగి క్రీడా ప్రాంగణం, వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఈ పోటీలను ప్రారంభించారు. పుదుచ్చేరి కరైకల్ మాహే యానాం వ్యాప్తంగా 8 జోన్‌లకు సంబంధించిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి, విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణప్రవీణ్, స్పోర్ట్స్ డిప్యూటీ డైరెక్టర్ వైద్యనాథన్, ఇండోర్ స్టేడియం ఇన్‌ఛార్జ్ ప్రకాష్, పిఇటీలు పాల్గొన్నారు.



దాతలకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న బాలబాలాజీ స్వామి ఆలయ సిబ్బంది

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు దాత విరాళం అందజేశారు. స్థానికులు పాటి త్రిమూర్తులు వారి కుటుంబ సభ్యులతో కలిసి బాలబాలాజీ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వారు స్వామి వారి అన్నప్రసాద ట్రస్ట్‌నకు విరాళంగా రూ.50,500 శనివారం అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ రాజు తెలిపారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యములో వేద ఆశీర్వచనం అందజేయగా, దేవస్థానం వారు ప్రత్యేకముగా అభినందించి శేష వస్త్రాలతో సత్కరించి స్వామి వారి చిత్రపటం అందజేశారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపాలిటీ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆర్‌డిఒ కె.శ్రీరమణి శనివారం పరిశీలించారు. పట్టణ పరిధిలోని జడ్‌పి బాలిక ఉన్నత పాఠశాలలో 129, 130 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్ల నమోదు కార్యక్రమంపై బిఎల్‌ఒలను ఆరా తీశారు. అలాగే ఎంఎల్‌సి ఎన్నికల దరఖాస్తులపై బ్లాక్ లేబుల్ అధికారులను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్‌సి ఓట్ల నమోదును వేగవంతం చేయాలని రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులను ఆమె ఆదేశించారు. ఇంకా పోలింగ్ కేంద్రాల్లో వసతులు, ఇబ్బందులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ర్యాలి ప్రసాద్ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

రాజకీయ విద్యా వ్యాపార కళారంగాల్లో స్ఫూర్తి దాయకంగా నిలిచిన రెడ్ల చరిత్రను అందరూ చదువుకునేందుకు వీలైన భాషలో రూపొందించారని ఆదిత్య విశ్వవిద్యాలయం ఛాన్సలర్ నల్లమిల్లి శేషారెడ్డి అన్నారు. ప్రముఖ రచయిత ర్యాలి ప్రసాద్ రచించిన 'ఘన చరితల రెడ్లు సుగుణ శీలురు భూమంచి రెడ్లు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. రచయిత ర్యాలి ప్రసాద్ మాట్లాడుతూ శతాబ్దాల కాలం నుంచి తెలుగు జాతికి రెడ్డి ప్రముఖులు అనేక రంగాలలో ఎనలేని సేవలందించారని, వారి కృషిని రేపటి తరాలకు అందివ్వాలనే ఈ పుస్తకం రచించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు నల్లమిల్లి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ రెడ్ల ఘన చరిత్రను రచయిత ర్యాలి ప్రసాద్ సవివరంగా అందించారని అన్నారు. సంస్థ కార్యదర్శి ద్వారంపూడి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఆధారాలతో కూడిన చరిత్ర అందరూ చదవాల్సిన పుస్తకమని అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి - కాజులూరు

మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ ఇచ్చారు. శలపాక గ్రామంలో దీపావళి రోజున జరిగిన హత్యోదంతంలో ప్రాణాలు కోల్పోయిన బత్తిల కుటుంబీకులను మంత్రి సుభాష్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ గ్రామంలో చిన్నచిన్న సంఘటనలు జరిగినప్పుడు స్థానికంగా ఉన్న పెద్దలతో కూర్చిని మాట్లాడుకుంటే సరిపోయేదని అన్నారు. అయితే క్షణికావేశంలో బత్తుల కుటుంబంలో ముగ్గురు మృతి చెందడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబీకులను అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. మృతి చెందిన రమేష్ కుమారునికి రూ.50 వేలను ఫిక్స్ డిపాజిట్ చేయడం జరుగుతుందని, మృతుల భార్యలకు ఉద్యోగ భద్రత కల్పిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతు గనిరాజు, మండల టిడిపి అధ్యక్షులు పేపకాయల బాబ్జి, స్థానిక నాయకులు వల్లు అర్జునరావు, చుండ్రు వీర్రాజుచౌదరి, పోతురాజు భీమారావు, అప్పన్న, కోట తాతబ్బాయి పలువురు నాయకులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం వద్ద అన్నదానం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ముత్యాలమ్మ తల్లి తీర్థ మహోత్సవం, కార్తీక మాసం పురస్కరించుకుని స్థానిక ఆలయం వద్ద శనివారం అన్నదానం నిర్వహించారు. మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్, రచ్చ కామేశ్వరరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, టిడిపి నాయకులు నడింపల్లి వినోద్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట శివారు కాకినాడ రోడ్‌లోని ఎస్‌ఆర్ బంకులో శనివారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కొలతలు రికార్డులు పరిశీలించి వాటిలో తేడాను అధికారులు గమనించారు. దీంతో 6 ఏ కేసు నమోదు చేసినట్లు ఎంఎస్‌ఒ వీరాస్వామి తెలిపారు. దీంతో బంక్‌లో ఉన్న 3 వాహనాలు, బంక్‌ను సీజ్ చేసినట్టు సివిల్ సప్లై , విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ తహశీల్దార్ విజయ్ కుమార్, ఎఎస్‌ఒ లక్ష్మి, లీగల్ మెట్రాలజీ, స్థానిక విఆర్‌ఒలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన భద్రాసి శివ కుటుంబాన్ని ఆదుకోవాలని తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. శనివారం ఎపి రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. అనంతరం తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సంఘటన స్థలాన్ని పరిశీలించి, బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిఆర్‌సిఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, నాయకులు డి.సురేష్, డాన్ శ్రీను, జంపెల్లి దుర్గా, వి.అరవాలమ్మ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - రౌతులపూడి

స్థానిక సిహెచ్‌సి పరిధిలోని పలు గ్రామాలకు చెందిన గర్భిణులకు శనివారం వైద్య అధికారి జానకిదేవి, వైద్యులు డాక్టర్ సునీత, డాక్టర్ పావని, డాక్టర్ సౌమ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రధానమంత్రి సురక్ష యోజన మాతృత్వ పథకంలో ఆసుపత్రి హెడ్ నర్స్ మడకం సరస్వతి ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహారాన్ని అందజేశారు.

ఆదిత్య ప్రిన్సిపల్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీ రింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ ఆదిరెడ్డికి ఎపి ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆదిత్య విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల లో ఇఇఇ విభాగంలో బిటెక్, ఎంటెక్ చేసి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ చేసిన ఈయన వివిధ హోదాలలో విశేష సేవలు అందిస్తున్నారని అన్నారు. నేడు ప్రిన్సిపల్‌గా ఉన్న డాక్టర్ రమేష్ అదిరెడ్డికి ఆయన శుభాభి నందనలు తెలిపారు. ఆదిత్య అధినేతలు డాక్టర్ ఎన్.శేషారెడ్డి, ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్స లర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాసరావు, వివిధ విభాగాల డీన్‌లు, విభాగా ధిపతులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది రమేష్‌కు అభినందనలు తెలిపారు.

అన్నదాన పథకానికి రూ.25 లక్షల విరాళం

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం వీర వెంకట సత్యనా రాయణ స్వామి వారి దేవస్థానంలో నిర్వ హిస్తున్న నిత్య అన్నదాన పథకానికి ఒక ట్రస్ట్‌కు సంబంధించిన దాతలు రూ.25 లక్షలు విరాళం అందించారు. శనివారం సికింద్రాబాద్‌కు చెందిన గల్లా రోసమ్మ మెమోరియల్ సభ్యులు దీనికి సంబంధించి రూ.25 లక్షల చెక్కును దేవస్థానం ఇఒ కె.రామచంద్రమోహన్‌కు అందజేశారు.

పట్టభద్రుల ఓటు హక్కు కోసం 2,250 దరఖాస్తులు

ప్రజాశక్తి - అంబాజీపేట

తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఓటు హక్కు కోసం అంబాజీపేట మండలంలో మొత్తం 2,250 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తహశీల్దార్ జె.వెంకటేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకర్గ ఓటరు జాబితా తయారీలో భాగంగా పట్టభద్రుల నుంచి ఈ నెల 6వ తేదీ వరకూ ఆన్లైన్లో 1,287 దరఖాస్తులు, ఆఫ్లైన్ లో 963 దరఖాస్తులు అందినట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ దరఖాస్తులను మండలంలోని పోలింగ్ బూత్ ల వారీగా విభజించి బిఎల్ఒల ద్వారా గ్రామాల్లోని పోలింగ్ బూత్ స్థాయిలో విచారణ చేయను న్నారన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలనీ మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు చేయనున్నట్లు తహశీల్దార్ తెలిపారు. మండల పరిధిలో ఉన్న 53 పోలింగ్ కేంద్రాల వద్ద బిఎల్ఒలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే పేరు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి - యంత్రాంగం



కెఎస్‌వి.కృష్ణారెడ్డి



కెవి.శోభారాణి

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఫెలో టీచర్' విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఇద్దరి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారికి శనివారం పలువురు అభినందనలు తెలిపారు. వివరాలు ఇవి..

కొత్తపేట: రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఫెలో టీచర్' విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి రావులపాలెం మండలం ఈతకోట హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కెఎస్‌వి.కృష్ణారెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ నుంచి శనివారం ఆదేశాలు వెలువడ్డాయి. నెల 11న విజయవాడలో జరగనున్న ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఈ అవార్డును కృష్ణారెడ్డికి ప్రదానం చేయనున్నారు. విద్యారంగంలో విశేష కృషి చేసి ఇప్పటివరకూ ఏ అవార్డుకూ దరఖాస్తు చేయని ప్రధానోపాధ్యాయులను విద్యా శాఖ అధికారులు గుర్తించి గౌరవించే విధంగా ఈ ఏడాది 'ఫెలో టీచర్ అవార్డు'ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పరిచింది. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

రామచంద్రపురం: పట్టణంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో కంప్యూటర్ అప్లికేషన్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న కెవి.శోభారాణికి ఈ ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈ మేరకు శనివారం కళాశాల విద్యా డైరెక్టర్ కార్యాలయం నుంచి సమాచారం అందింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అందరూ అవార్డుకు ఎంపికైన డాక్టర్ శోభారాణీని సత్కరించారు. ఇటువంటి అవార్డు రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మొట్టమొదటిసారిగా లభించినందుకు గ్రామ పెద్దలు, పుర ప్రముఖులు కూడా హర్షం వ్యక్తం చేశారు.

కోటిదీపోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రతి ఏటా నిర్వహిస్తున్న మండలంలోని నర్సిపూడిలో శ్రీలక్ష్మీనారాయణస్వామి వారి క్షీరాబ్ది ద్వాదశి కోటి దీపాల మహోత్సవ పోస్టర్‌ను పారిశ్రామికవేత్త, శ్రీమురళీకష్ణ సంస్థల అధినేత, కొత్తపేట నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వంటిపల్లి పాపారావు శనివారం ఆవిష్కరించారు. ఈ మేరకు పాపారావు స్వగృహం నందు జరిగిన కార్యక్రమంలో నిర్వహక కమిటీ, గ్రామ పెద్దల పాల్గొన్నారు. ముందుగా వారందరి ఆధ్వర్యంలో పాపారావును ఘనంగా సన్మానించారు. అలాగే 13న నిర్వహించే కోటి దీపోత్సవానికి తప్పక హాజరు కావాలని వారు పాపారావును కోరారు

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం సాం ఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో శనివారం విద్యార్థునులకు రోడ్డు సేఫ్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీ య రహదారికి సమీపంగా వసతి గృహం ఉండటంతో విద్యార్థినులు పాఠశాలకు వెళ్లి, వచ్చే సమయంలో రోడ్డు భద్రతపై తీసుకోవలసిన జాగ్రత్తలను సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ వివరించారు. వసతి గృహ అధికారిని పి.రోజా ను విద్యార్థులకు అందిస్తున్న మౌలిక వసతులు, ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నా రు. బాలికల సేఫ్టీ మరియు సెక్యూరిటీ విష యంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. వసతి గృహంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ 65 మంది విద్యార్థినులు ఉండ డంతో వారు హైస్కూల్‌కు వెళ్లి వచ్చేటప్పుడు మార్గం మధ్యలో ఏదైనా ఇబ్బంది తలెత్తితే తక్షణం డయల్ 100, లేదా సీఐ 9440796529, జగ్గంపేట ఎస్ఐ 9440796569 నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.